క్లుప్తంగా

కేతవరంలో కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్: తపన ఫౌండేషన్ ఆధ్వర్యాన గ్రామీణ మహిళల జీవనోపాధికి ఉపయోగపడేలా కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని జంగారెడ్డిగూడెం మండలం కేతవరం సర్పంచ్ వరద వెంకట సత్యవతి అన్నారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, ఉప సర్పంచ్ కౌలు అమ్మరి శివ, తపన ఫౌండేషన్ ప్రతినిధి సాయి సింగ్ తివారి తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులపై సమగ్రంగా చర్చించాలి

కామవరపుకోట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై సమగ్ర చర్చ జరగాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ సూచించినట్లు జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్ గుర్రాల రవికుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా ఎస్సీ, ఎస్టీ కేసుల విజిలెన్స్ కమిటీలో స్థానం కల్పించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ పండు జగదీష్, ప్రతాప్ బాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కుక్కునూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఏలూరులోని కేపీడీటీ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని పి.దుర్గ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో అండర్ 14 విభాగంలో హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన బి.వనజ, అండర్ 17 విభాగంలో హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన పి.భవ్య శ్రీ, ఫిజికల్ డైరెక్టర్ తెల్లం శ్రీనివాసరావును అభినందించారు.

అంతర్జాతీయ అంతర్జాలాల సదస్సు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరోజు అంతర్జాతీయ అంతర్జాలాల ప్రత్యక్ష సదస్సు శుక్రవారం నిర్వహించారు. కళాశాల స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న కోణాలు అనే అంశంపై వక్తలు మాట్లాడారు. సదస్సును రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిషనర్ డాక్టర్ పోల భాస్కర్ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించగా పలు వర్సిటీల ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు

వరప్రసాద్‌కు జాషువా పురస్కారం ప్రదానం

కొయ్యలగూడెం: గుర్రం జాషువా పురస్కారంతో తనను సత్కరించినట్లు బోడిగూడెం జెడ్పీ హైస్కూల్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ ఊటికూరి వరప్రసాద్ శుక్రవారం తెలిపారు. జాషువా పురస్కరించుకుని ఏలూరులో జరిగిన సమావేశంలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా తనకు పురస్కారం ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిళ్ళంగోళ్ళ శ్రీలక్ష్మి, ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజా యోనా, నన్నయ వర్సిటీ ప్రొఫెసర్ పువ్వుల ఆనంద్, శ్రీశ్రీ కళావేదిక సభ్యులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కామవరపుకోట : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని జెడ్పీటీసీ, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ కడిమి రమేష్ అన్నారు. మండలంలో జీలకర్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పాటు భోజనం చేశారు. కార్యక్రమంలో అల్లూరి పెద్దిరాజు, మాజీ వైస్ ఎంపీపీ గంగాధరరావు, తమ్మిశెట్టి సూర్యప్రకాష్, వెంకట్, మీసాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రి సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ప్రారంభించి రక్తదానం చేశారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ జీజే మానిక, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీరా మహేష్‌కు డాక్టరేట్ ప్రదానం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వీరా మహేష్ డాక్టరేట్ పొందారు. కృష్ణా విశ్వవిద్యాలయం బయోసైన్సెస్ అండ్ బయో టెక్నాలజీ శాఖ నుంచి మహేష్ డాక్టరేట్‌ను అందుకున్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో జరిగిన మౌఖిక పరీక్ష, సమ్మెట్‌లో తనకు డాక్టరేట్ డిగ్రీని ప్రతిపాదించగా, శుక్రవారం విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను అధికారికంగా ప్రకటించిందని ఆయన తెలిపారు.

ప్రజారోగ్యమే సీఎం జగన్ లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి
- అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యేలు బాలరాజు, ఎలీజా సూచన


దుద్దుకూరులో అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు


జంగారెడ్డిగూడెంలో మాట్లాడుతున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

బుట్టాయగూడెం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సూచించారు. మండలంలోని దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆయన నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, వైద్యాధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహణ ఏర్పాట్లపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటివరకూ ప్రజలకు అందించే సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. అలాగే ఇకపై ముఖ్యమంత్రి ప్రజారోగ్యానికి కూడా శ్రద్ధ తీసుకుంటున్నారని అన్నారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ ఆరోగ్య భరోసా కల్పించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నెలరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమం గిరిజన మండలాల్లో పూర్తిగా విజయవంతమయ్యేలా దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం గిరిజన మండలాల్లో టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి జ్వరాలతో ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బుట్టాయగూడెం ఈఓపీఆర్‌డీ ఎం.శ్రీహరి, పోలవరం ఎంపీడీఓ జి.శ్రీను, కొయ్యలగూడెం ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి, కుక్కునూరు ఈఓపీఆర్‌డీ నరసింహరావు, జీలుగుమిల్లి ఎంపీడీఓ కృష్ణప్రసాద్, కేఆర్ పురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూష, డాక్టర్ చందన్ మాథుర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

జంగారెడ్డిగూడెం: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ ప్రజలకు ఇంటి వద్దే వైద్యసేవలను అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభించనున్నారని తెలిపారు. రేపటి (శనివారం) నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1.6 కోట్ల కుటుంబాలకు ఆరోగ్యపరమైన పరీక్షలు చేసి వారికి కావాల్సిన వైద్యసలహాలతో పాటు అవసరమైన మందులు ఉచితంగా సరఫరా అందిస్తారని చెప్పారు. చింతలపూడి నియోజకవర్గంలో శనివారం నాలుగు చోట్ల ఈ శిబిరాలు నిర్వహించనున్నారన్నారు. తాను రేచర్ల గ్రామంలో నిర్వహించే క్యాంపునకు హాజరవుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మిగిలిన చోట్ల వలంటీర్లు, హెల్త్ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రతి ఇంటికీ వెళతారన్నారు. సమావేశం అనంతరం ఆరోగ్య సిబ్బంది ఎమ్మెల్యేకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులతో జగనన్న ఆరోగ్య సురక్షపై, ఏపీ నీడ్స్ జగన్, నాయకులు గ్రామాల్లో చేపట్టాల్సిన పల్లె నిద్ర, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. ప్రతి ఇంటికీ నాయకులు వెళ్లి ఆంధ్రప్రదేశ్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవసరాన్ని వివరించాలని సూచించారు. అలాగే ప్రజాప్రతినిధులు పల్లె నిద్రలో పాల్గొని, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, వామిశెట్టి హరిబాబు, గురజాల పార్థసారథి, మిడతా రమేష్, మందలపు సాయిబాబ, పండు జగదీష్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పి.కన్నాపురంలో..

ద్వారకాతిరుమల: మండలంలోని పి.కన్నాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో తిరుపతిరావు తెలిపారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైద్యారోగ్య శాఖ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు కోరారు. బయ్యనగూడెం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆడిటోరియంలో రింగు రోడ్డు గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. శనివారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని పోలవరం నియోజకవర్గం పరిధిలో బయ్యనగూడెం గ్రామం నుంచి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రారంభిస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గంగరాజు చెప్పారు.

జంగారెడ్డిగూడెంలో వైద్య పరీక్షలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యపరీక్షలు, సర్వే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈనెల 30వ తేదీ శనివారం నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు, కుటుంబసభ్యుల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో శుక్రవారం ఆయా సచివాలయాల పరిధిలో వైద్యపరీక్షలు నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం షెడ్యూల్ ఇలా..

జంగారెడ్డిగూడెం రూరల్: ఈనెల 30వ తేదీ నుంచి వచ్చేనెల 21వ తేదీ వరకు జంగారెడ్డిగూడెం మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్ తెలిపారు. ఈనెల 30న వేగవరం-2 సొసైటీ ఎడ్యుకేషన్ సొసైటీ, అక్టోబర్ 3న గుర్వాయిగూడెం సచివాలయం, 4న చక్రదేవరపల్లి విలేజ్ హెల్త్ క్లీనిక్, 5న టెక్కినవారిగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, 6న పట్టెన్నపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, 7న పేరంపేట ఎంపీపీ పాఠశాల, 9న తాడువాయి-1 హైస్కూల్, 10న పంగిడిగూడెం హైస్కూల్, 11న శ్రీనివాసపురం హైస్కూల్, 12న లక్కవరం -2 హైస్కూల్‌లో, 13న మైసన్నగూడెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, 16న దేవులపల్లి ఎంపీపీ పాఠశాల, 17న ఎ.పోలవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, 18న కేతవరం హైస్కూల్, 19న వేగవరం ఎంపీపీ (మెయిన్, 20న పుట్లగట్లగూడెం ఎంపీపీ పాఠశాల, 21న తిరుమలాపరం హైస్కూల్‌లో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట: మండలంలో ఈనెల 30వ తేదీ నుండి అక్టోబర్ 19వ తేదీ వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీన కామవరపుకోట జిల్లా పరిషత్ హైస్కూల్లో, అక్టోబర్ 3, 12వ తేదీలలో తడికలపూడి హైస్కూల్లో, 4న ఈస్ట్ యడవల్లి హైస్కూల్లో, 5న ఆడమిల్లి హైస్కూల్లో, 6న రావికంపాడు హైస్కూల్లో, 7న కళ్ళచెరువు పంచాయతీ గండిగూడెం హైస్కూల్లో, 9న గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం హైస్కూల్లో, 10న కేఎస్ రామవరం రైతు భరోసా కేంద్రంలో, 11న ఉప్పలపాడు మండల పరిషత్ పాఠశాలలో, 13న కామవరపుకోట గ్రామపంచాయతీ కార్యాలయంలో, 16న సాగిపాడు పంచాయతీ వీరంపాలెం ఎంపీపీ స్కూల్‌లో, 17న కామవరపుకోట ఎంపీ యూపీ స్కూల్‌లో, 18న అంకాలంపాడు గ్రామ పంచాయతీ జలపవారిగూడెం ఎంపీయూపీ స్కూల్‌లో, 19న వీరిశెట్టిగూడెం ఎంపీ యూపీ స్కూల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆమె తెలిపారు.

గణనాథుని లడ్డూ వేలం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గుర్వాయిగూడెం రామాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. దల్లి నాగేశ్వరరావు దంపతులు లడ్డూను రూ: 6,000లకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు లడ్డూ ప్రసాదాన్ని ఆయనకు అందజేశారు. గ్రామ పెద్దలు దల్లి చిన వీర్రాజు రెడ్డి, పెద్ద వీర్రాజు రెడ్డి, రామాంజనేయరెడ్డి, ఎల్లారెడ్డి, అప్పల రెడ్డి, బాకి రామాంజనేయరెడ్డి, దేరెట్ల రామిరెడ్డి, దేరెట్ల అప్పల రెడ్డి పాల్గొన్నారు.

గంగానమ్మ దసరా ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణకు జగనన్న కృషి


మధ్యాహ్నపువారిగూడెంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

టి.నరసాపురం: ప్రజారోగ్య పరిరక్షణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, దీనిలో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేట పంచాయతీ మధ్యాహ్నపువారిగూడెం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి వైద్యసేవలు అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. మండలానికి ఇద్దరు వైద్యులను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన అందరికి అందుతున్నాయని ఆరా తీశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమాన్ని అందిస్తున్నారని, అన్ని శాఖల సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి తేవడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా అవినీతి రహితంగా కుల, మత, రాజకీయ వర్గాలకు అతీతంగా అందిస్తున్నారని వివరించారు. నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. రైతు భోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లకు సుందరమైన పక్కా భవనాలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు శ్రీనురాజు, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి మధు, పామాయిల్ ఓఈఆర్ కమిటీ సభ్యులు తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, దేవరపల్లి ముత్తయ్య, యర్రా గంగాధరరావు, దాసరి రాంబాబు, గొల్లపల్లి భద్రయ్య, తోట రామారావు, తమ్మిశెట్టి రామారావు, చందనాల శ్రీను, ఆళ్ల బసవరాజు, తమ్మిశెట్టి శ్రీను, గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.నిరీక్షణరావు, పారేపల్లి సత్యనారాయణ, అమరేసు చింతాలు, చందనాల రాజేంద్రప్రసాద్, మొరవనేని అనిల్ తదితరులు ఉన్నారు.

రహదారి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్: రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని అమ్మపాలెంలో బీటీ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రభుత్వం ద్వారా విడుదల అయ్యే నిధులను సక్రమంగా వినియోగించుకుంటూ పల్లెల్లో మౌలిక సదుపాయాలను కల్పించుకోవాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సూరవరపు రాంబాబు, గెల్లా వెంకటరమణ, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు తానిగడప నిర్మలా కుమారి, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారధి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి చండీహోమం


నూకాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో కొలువైన నూకాలమ్మ ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని 55వ చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. చండీహోమం ప్రత్యేకమైన ధార్మిక సేవగా భక్తులకు అందుబాటులో ఉంచినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ప్రధానార్చకుడు యర్రమిల్లి మనోజ్ శర్మ పూజా కార్యక్రమాల అనంతరం చండీహోమం నిర్వహించారు. ఉభయదారులు ఎగ్గేపల్లి రవికుమార్, సరిత(తణుకు), మద్దుల శ్రీనివాస్ దంపతులు(సీతంపేట), కొండేటి సతీష్, సత్యవాణి దంపతులు వ్యవహరించారు. శ్రీ నూకాంబికా మహిళా సేవా బృందం సభ్యులు పాలపొంగళ్ళు వంట నిర్వహించగా, హరే శ్రీనివాసా శ్రీ అభయాంజనేయ స్వామి కోలాట భజన బృందం కోలాటం నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా అమ్మవారికి కనిగళ్ల రామలీలావతి కుటుంబ సభ్యులు సుమారు 650 గ్రాముల వెండి కుందుల జత సమర్పించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ(పండు) తెలిపారు.

రాట మహోత్సవం

దసరా మహోత్సవాలకు ఆలయ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), రామలక్ష్మి దంపతులు, నూకాంబిక సేవా బృందం సభ్యులు, గ్రామ భక్త మహా జనులు, ఆలయ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ఉదయం ఏక శిలా ధ్వజస్తంభం వద్ద పాలకర్రను పందిరి రాటగా వేసి దసరా ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దసరా పందిరి రాట మహోత్సవాలు


జంగారెడ్డిగూడెంలోని విజయదుర్గ ఆలయం వద్ద రాటను పాతిన ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ సన్నిధిలో శుక్రవారం దసరా పందిరి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక వేత్త ధనకుమార్, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు దసరా ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, కమిటీ సభ్యులు దసరా పందిరి రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు ఎం.శ్రీనివాస్ పూజలు చేశారు. అలాగే శుక్రవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాడ గణేష్, శ్రీదేవి దంపతులు, బవిరిశెట్టి నాగేశ్వరరావు, కొత్తగుంట శ్రీనివాస్, చోడవరపు రంగారావు, యర్రా నాగేశ్వరరావు, పసుమర్తి రమాదేవి, జయవరపు సుధ, కాసనవల్లి లీల, కె.మోహన్ భాస్కరరావు పాల్గొన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో కొలువైన విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద రాట పాతే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో నిర్వహించనున్న దసరా శరన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రారంభ కార్యక్రమంగా ఆలయ కమిటీ సభ్యులు రాట పాతే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పురోహితులు సుదర్శన వేణుగోపాలచారి వేదమంత్రాల నడుమ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుని నిమజ్జనం


ద్వారకాతిరుమలలో గణనాథుడిని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ద్వారకాతిరుమల: జై బోలో గణేష్ మహరాజ్‌కి.. జై అన్న నినాదాలు ద్వారకాతిరుమల క్షేత్ర పురవీధుల్లో మార్మోగాయి. విచిత్ర వేషధారణలు, డీజే సౌండ్ల హోరు, డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాల నడుమ శుక్రవారం వినాయక నిమజ్జనం ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. స్థానిక చెరువు వీధిలో గణేష్ ఉత్సవ కమిటీ నెలకొల్పిన గణనాథుడి నిమజ్జనాన్ని అట్టహాసంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు క్షేత్ర పురవీధుల్లో గణేషుడ్ని ఊరేగించారు. ఈ సందర్భంగా వేషధారణలు, యువకులు చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాత్రి స్థానిక నృసింహ సాగరంలో గణేష్ నామస్మరణల నడుమ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేటితో గణేష్ ఉత్సవాల ముగింపు

కొయ్యలగూడెం: గణనాథుని ఉత్సవాలు శనివారంతో ముగియనున్నాయి. స్థానిక కో ఆపరేటివ్ బ్యాంకు వీధిలో నెలకొల్పిన 19 అడుగుల మట్టి గణనాథుని విగ్రహం మండలంలోనే అతిపెద్దదిగా నిలిచింది. ఈ గణనాథుని విగ్రహ ఊరేగింపు సాయంత్రం నుంచి భారీ ఎత్తున నిర్వాహకులు నిర్వహించనుండగా, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నారు. 29వ వార్షికోత్సవ సందర్భంగా నటరాజ అలంకారంతో ఉన్న భారీ గణనాథుని ఉత్సవాన్ని ప్రజలు బంధుమిత్రులతో సహా చూసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేశారు. బస్టాండ్ దగ్గర ఆటో స్టాండ్‌లో నెలకొల్పిన గణనాథుని విగ్రహాన్ని ఆటోవాలాలు ఘనంగా ఊరేగించారు. కొయ్యలగూడెం టౌన్ పరిధిలోనే 17 చోట్ల భారీగా గణనాథుని ఉత్సవాలు నిర్వహించి గంగమ్మ ఒడికి చేర్చారు.

పొగాకు ఉత్పత్తి నియంత్రణపై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం రూరల్: పొగాకు బోర్డు అనుమతులు మేరకే పంట సాగు చేయాలని, అధికంగా పొగాకు పండిస్తే రైతులకు ఇబ్బందులు తప్పవని బోర్డు రీజినల్ మేనేజర్ ఆదిశేషయ్య తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామంలోని శుక్రవారం పొగాకు ఉత్పత్తి నియంత్రణపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్ఎం ఆదిశేషయ్య మాట్లాడుతూ 2022–23లో వచ్చిన ధరలను దృష్టిలో ఉంచుకుని అధికంగా పొగాకును ఉత్పత్తి చేయవద్దని రైతులకు సూచించారు. వచ్చే ఏడాది ఇవే ధరలు పలుకుతాయని నమ్మకం లేదన్నారు. బోర్డు అనుమతించిన మేరకే పొగాకు సాగుచేయాలని సూచించారు. జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం – 1 వేలం నిర్వాహణాధికారి బి.శ్రీహరి మాట్లాడుతూ పొగాకు పంట అధికంగా పండించి అనర్థాలు కొనితెచ్చుకోవద్దన్నారు. గత అనుభవాలు దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ మార్కెట్ దృష్ట్యా, పంటను పరిమితంగా సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం– 1 సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ కె.సుధీర్, ఫీల్డ్ ఆఫీసర్ ఏకే దాసు, ఐటీసీ ప్రతినిధులు చారువాక, రైతులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ చదివిన విద్యార్థులు డిప్లొమో మొదటి సంవత్సరం స్పాట్ అడ్మిషన్‌ల కోసం ఖాళీ ఉన్నాయన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పోలవరం రూరల్: పోలవరం గ్రామానికి చెందిన ఉప్పలవు సుబ్బలక్ష్మి అనే మహిళ గడువు ముగిసిన మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. ప్రస్తుతం పోలవరం వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బలక్ష్మికి 2015లో విశాఖపట్టణానికి చెందిన వ్యక్తితో వివాహమైంది. అయితే భర్తను వదిలివేసి పోలవరం గ్రామంలో ఒక సెల్ షోరూం పెట్టుకుని జీవిస్తోంది. ఈమెకు షాపులో రాజమండ్రికి చెందిన లోకేష్ కుమార్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె గర్భం దాల్చినట్లు తెలిందన్నారు. లోకేష్ కుమార్ పెళ్లికి నిరాకరించాడని మనస్తాపంతో ఆమె గడువు ముగిసిన మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడి

పోలవరం రూరల్: పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన పులిబోయిన పకీరయ్యపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పులిబోయిన పకీరయ్య కుటుంబసభ్యులతో గొడవ పడుతుండగా, వరుసకు బావ అయిన ఇళ్ల వీరబాబు గొడ్డలితో పకీరయ్యపై దాడి చేశాడు. ఈ ఘటనలో పకీరయ్యకు గాయాలు కాగా, కొయ్యలగూడెంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్సై తెలిపారు.